క్లుప్తంగా

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి



భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: కుమురం భీం ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధి లోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడా రు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ కాంతయ్య, వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెండావెంకటాపూర్ సర్పంచ్ సునీత, తిమ్మాపూర్ ఎంపీటీసీ స్వప్న, ఆదివాసీ సంఘం నాయకులు సూరు పటేల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

11న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కోటపల్లి: కోటపల్లి, చెన్నూర్, భీమారం, కొమ్మెర, జైపూర్, మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) ఈ నెల 11న కోటపల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యల ఉంటే ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు పరిష్కార వేదికకు వచ్చి పరిష్కరించుకోగలరని కోరారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. మంచిర్యాలలో పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఏఐఎస్‌బీ, ఏఐఎఫ్‌డీఎస్ సంఘాల నేతలు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నేతలు శ్రీకాంత్, సన్నీగౌడ్, తిరుపతి, సికందర్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ఆటోయూనియన్ కార్యవర్గం ఎన్నిక

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి గ్రామ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొట్టె సత్తయ్య, అధ్యక్షుడిగా కొట్టె నరేష్, ఉపాధ్యక్షుడిగా మెరుగు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా బాకం వెంకటేష్, కోశాధికారిగా గాలిపెల్లి గురువయ్య, ప్రచార కార్యదర్శులుగా కుశనపల్లి సిద్దు, ప్రవీణ్, సలహాదారులుగా రామదాసు, శ్రీనివాస్, మల్లేష్ ఎన్నికయ్యారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో రూ.5లక్షల, ప్రభుత్వ నిధులతో ఖబ్రస్తాన్(శ్మశాన వాటిక) చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేసి, నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్, ఉపసర్పంచ్ తిరుపతి, మజీద్ కమిటీ సదర్ దావుద్ ఖాన్, నాయబ్ సదర్ ఇమ్రాన్ ఖాన్, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



సాయం అందిస్తున్న దాతలు

దండేపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన ఎండీ మాలన్, వైద్య ఖర్చులకు మంచిర్యాలకు చెందిన మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.17,200విరాళాలు సేకరించారు. అందుకు సంబంధించిన నగదును కరీంనగర్‌లో ఆమె చికిత్స పొందుతున్న ఆసుపత్రి వద్ద ఆమె కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అభినయ్, సాయికుమార్, ప్రణవ్ పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన లంక వనజ అనే మహిళా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంగా అదే గ్రామానికి చెందిన రేగుంట రాకేశ్ అనే యువకుడు పలువురి దాతల నుంచి సేకరించిన రూ.15వేలు, రెండు నెలలకు సరిపడ నిత్యవసర సరుకులను ఆదివారం బాధితురాలికి అందజేశారు.

అప్రకటిత కోతలతో అవస్థలు

- సమాచారం లేకుండా గంటల కొద్దీ విద్యుత్‌లో అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ



భీమారంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

భీమారం: మండల కేంద్రంలో అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత వారం రోజుల నుంచి సమాచారం లేకుండా గంటల కొద్దీ విద్యుత్ తొలిగిస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం 24గంటల పాటు విద్యుత్ అందిస్తున్నామని ప్రకటిస్తున్న నేపథ్యంలో.. మండల కేంద్రంలో మాత్రం అందుకు విరుద్ధంగా రోజులో కనీసం 5గంటల వరకు కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో జైపూర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే సమయంలో కూడా ఇలా కోతలు విధించలేదని గుర్తుచేస్తున్నారు. భీమారంలో పదేళ్లక్రితం 33/11కేవీ సబ్‌సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి మండలంలోని 11గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో లేని సమస్య, మండల కేంద్రంలో గంటల కొద్దీ విద్యుత్ కోతలు విధిస్తుడడంతో వ్యాపారాలు చేసుకోలేక పోతున్నామని వాపోతున్నారు. రాత్రిళ్లు కూడా ఎప్పుడుపడితే అప్పుడు కరెంట్ తీసివేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ విషయంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయరని లైన్‌మెన్, లైన్‌ఇన్స్‌స్పెక్టర్లు స్థానికంగా ఉండరని ప్రజలు తెలిపారు.

ఇబ్బంది పడుతున్నాం

ప్రతిరోజు గంటల కొద్దీ కరెంట్ పోవడం వల్ల వ్యాపారం దెబ్బతింటుంది. ఎప్పుడు పోయి, ఎప్పుడు వస్తదో తెలుస్తలేదు. దీంతో కస్టమర్లకి సరైన సేవలు కూడా అందించలేకపోతున్నా. అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలి.

- మెండె మల్లేశ్, టీవీ మెకానిక్, భీమారం

ఆందోళన చేస్తాం

విద్యుత్ కోతలు అధికంగా ఉంటున్నాయి. ఎవరికీ సమాచారం లేకుండా తొలిగిస్తున్నారు. కోతలు విధిస్తుండడంతో చాలా ఇబ్బంది అవుతోంది. ఇప్పటికైనా కరెంట్ కోతలు లేకుండా చూడాలి. పరిస్థితి ఇలాగే కొనసాగిస్తే సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తాం.

- జాడి రాములు, రైతు

సమస్య పరిష్కరిస్తాం

భీమారంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం. మండల కేంద్రంలో నిరంతరం విత్యుత్ సరఫరా చేసేందుకు ఇప్పటికే ప్రత్యేక ఫీడర్‌ను ఏర్పాటు చేశాం. అనధికార కోతలు లేకుండా సిబ్బందిని ఆదేశిస్తాం.

- శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏఈ, భీమారం

త్రీఫేజ్ కరెంట్ ప్లీజ్!

- మరమ్మతు పనుల్లో జాప్యం..
- రెండు నెలలుగా పూర్తికాని పనులు
- ఆందోళనలో రైతులు



అసంపూర్తిగా త్రీఫేజ్ లైన్ పనులు

దండేపల్లి: వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.. సీఎం కేసీఆర్‌తో సహా, మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాల్లో వినిపించే మాట.. కానీ సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దండేపల్లి మండలం తాళ్లపేట రైతులు త్రీఫేజ్ విద్యుత్ కోసం నెలల తరబడి నిరీక్షిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

తాళ్లపేట గ్రామ శివారులో వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్-3, ఎస్‌ఎస్-4 ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో సుమారు 50 వరకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రెండు నెలల క్రితం ఈ రెండు ట్రాన్స్‌ఫార్మర్ల పరిధి నుంచి వెళ్లే త్రీఫేజ్ లైన్ కొంత దూరం పాడైంది. దానిని తొలగించి కొత్త లైన్ వేయడంలో సంబంధిత అధికారులు తీవ్రజాప్యం చేస్తున్నారు. వానా కాలం సీజన్ ప్రారంభమైనా పనులు పూర్తికాలేదు. దీంతో వ్యవసాయ బావుల వద్ద వరి నార్లు పోసుకుందామనుకున్న రైతులు కరెంటు కోసం నిరీక్షిస్తున్నారు. విద్యుత్ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి త్రీఫేజ్ విద్యుత్ లైన్ పనులు త్వరగా పూర్తిచేసి కరెంటు సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

కరెంటు కోసం చూస్తున్నాం

త్రీఫేజ్ కరెంటు లైన్ పాడయ్యింది. రెండు నెలలైనా రిపేర్ పనులు పూర్తి చేయలేదు. కరెంటు కోసం ఎదురు చూస్తున్నాం. కరెంటు వస్తేనే నార్లు పోసుకుంటం. త్రీఫేజ్ లైన్ మరమ్మతులు త్వరగా పూర్తిచేసి, కరెంటు ఇయ్యాలే.

-బోడకుంట మల్లేష్, రైతు, తాళ్లపేట

మరమ్మతులు పూర్తిచేస్తాం

త్రీఫేజ్ లైన్ మరమ్మతులు త్వరగా పూర్తిచేస్తాం. ఇటీవలే విరిగిన విద్యుత్ స్తంబాన్ని మార్చాం. త్వరలో త్రీఫేజ్ లైన్ పనులు కూడా పూర్తిచేయించి సరఫరాను పునరుద్ధరిస్తాం. ఈమేరకు కాంట్రాక్టరుతో మాట్లాడాం. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

-రాయినర్సు, విద్యుత్ ఏఈ

బోనమెత్తిన భక్తజనం



బోనంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

- ఊరూరా గ్రామదేవతలకు మొక్కులు
- నైవేద్యం సమర్పించి పూజలు
- వేడుకల్లో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

బెల్లంపల్లి: గ్రామ దేవతలకు భక్తజనం బోనమెత్తింది. భక్తి ప్రపత్తులతో డప్పు సప్పుళ్ల మధ్య తలపై బోనం పెట్టుకుని పురవీధుల మీదుగా నిర్వహించిన శోభయాత్రతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. బెల్లంపల్లి మున్సిపాలిటీ 24వార్డు పరిధిలో ఉన్న పోచమ్మ, నల్ల పోచమ్మ గ్రామ దేవతలకు ఏటా మాదిరిగానే బోనం తీశారు. ఆ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ దామెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఎత్తున బోనాల వేడుకను నిర్వహించారు. ఒక్కో ఇంటి నుంచి క్రమం తప్పక బోనం తీసుకుని మహిళలు వరుస క్రమంగా శోభయాత్రలో పాల్గొన్నారు. ముందు వరుసలో డప్పు కళాకారులు వాయిద్యాలు వాయిస్తుండగా, డప్పు సప్పుళ్ల మధ్య కొందరు మహిళలు శివాలూగారు. భక్తి పారవశ్యంతో పురవీధుల మీదుగా బోనంతో శోభయాత్ర చేసి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జీవాలను బలిచ్చి సల్లంగా చూడాలని వేడుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, పోలీసు సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోశలింగం(బీపీఎల్) కౌన్సెలర్లు రామునాయక్, కృష్ణ, సురేష్, ప్రభాకర్, రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏమాజీ, కాంగ్రెస్ నాయకులు మల్లేష్, జయరాం, స్వామి, బస్తీవాసులు, పుర ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

పాతబెల్లంపల్లిలో ఊరు కట్టు



దేవత విగ్రహాల వద్ద గ్రామస్తులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని పాతబెల్లంపల్లి గ్రామంలో ఊరు కట్టుట, పోచమ్మ మొక్కులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పంబాల జండిక వాయిద్యాల నడుమ పోచమ్మ, మైసమ్మ, భూదేవి, మహాలక్ష్మీ విగ్రహాలను ఊరేగింపు చేసి ప్రతిష్టాపన చేశారు. అనంతరం పంబాల (బైండ్ల)కళాకారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి ఊరు కట్టు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కారుకూరి రాంచందర్, సర్పంచ్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు. మాలగురిజాల, దుగ్నెపల్లి, చంద్రవెల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో బొబ్బలిపోచమ్మ, వాడ పోచమ్మ, దారి మైసమ్మకు మేకలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నల్లపోచమ్మకు బోనాలు



జన్నారం: అమ్మవారి వద్దకు వెళ్తున్న భక్తులు

జన్నారం: మండలంలోని కేతేశ్వర, కంకాలమ్మ ఆలయం వద్ద వెలసిన నల్ల పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు. డప్పు సప్పుళ్లతో అమ్మవారి వద్దకు వెళ్లి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. మొక్కులు తీర్చుకున్నారు.

ఆధ్యాత్మికం

గూడెంలో పూజలు



దండేపల్లి: మండలంలోని గూడెం గ్రామంలో గ్రామ దేవతల కొలుపులో భాగంగా ఆదివారం పోచమ్మ, పొలిమేర దేవతలకు పూజలు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని పాడి, పంట బాగుండాలని దేవతలకు మొక్కులు మొక్కి, నైవేద్యాలు సమర్పించారు.

పోచమ్మకు మొక్కులు

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో భక్తులు పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో వాడపోచమ్మలు, దారి మైసమ్మ వద్ద వాహనాల పూజలు చేసి కోళ్లు, మేకలు బలిచ్చి సల్లంగా చూడాలంటూ వేడుకున్నారు.





కోటేశ్వర్‌రావుపల్లెలో...

రామకృష్ణాపూర్: ఆషాఢమాస పోచమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు బొక్కలగుట్ట గ్రామపంచాయతీ పరిధిలోని కోటేశ్వర్‌రావుపల్లెలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను ఎత్తుకుని పోచమ్మ తల్లికి మొక్కులు సమర్పించారు.

మాంతమ్మ తీర్థాలకు తరలిన ప్రజలు

భీమారం: మండలంలోని పోలంపల్లి పరిధిలో గల మాంతమ్మ దేవత తీర్థాలకు ఆదివారం వివిధ గ్రామాల ప్రజలు తరలివెళ్లారు. ఏటా వర్షాకాలం ప్రారంభంలో మాంతమ్మను దర్శించుకోవడం ఆనవాయితీ. మాంతమ్మ వద్దకి వెళ్లి, అనంతరం చెట్ల కింద వంటలు చేసుకొని భోజనాలు చేశారు.

కరెంట్ సమస్య పరిష్కరించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఇందన్‌పల్లి గ్రామస్తులు

జన్నారం: ఇందన్‌పల్లి గ్రామంలో లోవోల్టేజీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అప్రకటిక విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జన్నారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట ఇందన్‌పల్లి గ్రామస్తులు రాస్తారోకోకు దిగారు. కరెంటు సమస్యపై పలు మార్లు విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. లో వోల్టేజీ సమస్యను తీర్చాలని కోరారు. ఇందన్‌పల్లిలో మినీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, పర్మినెంట్ లైన్‌మెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో ఇరువైపుల వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై తానాజీనాయక్ అక్కడికి చేరుకుని, సబ్ ఇంజనీర్ అజయ్‌ని పిలిపించి మాట్లాడించారు. 15రోజుల్లో విద్యుత్ సమస్య తీరుస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కంటెం శంకరయ్య, చంద్రగౌడ్, మల్లేశ్, తిరుపతి, భగవంతరావు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



నాయకులతో క్రికెట్ క్రీడాకారులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదివారం గురుస్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రీమి యర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి ప్రభాకర్, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. క్రీడా స్ఫూర్తితో ఆడి ఆటల్లో రాణించాలని సూచించారు. అండర్-14విభాగంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు తొంగల మల్లేష్, గెల్లి జయరాం, సలీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరగకముందే పట్టించుకోండి

భీమారం: మండల కేంద్రంలోని మాదన్నగూడెంలో మురుగుకాలువల నిర్మాణం కోసం కందకాలు తవ్వారు. విద్యుత్ స్తంభం సమీపంలోనే కందకం తవ్వడంతో పడిపోయేలా ఉంది. వర్షం వచ్చినప్పుడల్లా మట్టి అందులో కూరుకుపోతుందని, నీరు నిలుస్తోందని, విద్యుత్తు లైన్‌కు సంబంధించిన ఆ స్తంభం పడిపోకముందే.. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని పజ్రలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: శ్రీనివాస్, కార్యదర్శి
- ఫోన్ నంబర్ : 8555898819



నిరుపయోగంగా క్రీడాప్రాంగణం

భీమిని: కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని క్రీడాప్రాంగణం నిరుపయోగంగా మారింది. క్రీడా ప్రాంగణంలో సరైన వసతులు కరువయ్యాయి. బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో నిండి పోయింది. యువకులు క్రీడలు ఆడేందుకు మక్కువ చూపడం లేదు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

'పనులు పూర్తయినా ప్రారంభించని భవనం'

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో నిర్మించిన మండల విద్యావనరుల కేంద్రం పనులు పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా, ప్రారంభించడం లేదు. ఈ విద్యా సంవత్సరానికైనా మండల విద్యావనరుల కేంద్రాన్ని ప్రారంభించేలా చూడాలని కన్నెపల్లి మండల వాసులు కోరుతున్నారు.

'అవినీతి పాలనకు చరమగీతం పాడుదాం'



మాట్లాడుతున్న రాథోడ్ రమేశ్

జన్నారం: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు చరమగీతం పాడి, రానున్న ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. జన్నారం మండలం రాంపూర్, తిమ్మాపూర్, తపాలపూర్ గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పర్యటిస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. బీజేపీతోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమన్నారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. అవినీతి, అక్రమాలు పెరిగాయన్నారు. అవినీతి రహిత తెలంగాణ బీజేపీతోనే సాధ్యమన్నారు. ప్రజలు రానున్న ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శంకరయ్య, వెంకటస్వామి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, జిల్లా నాయకుడు మధుసుదన్‌రావు, నాయకులు సురేశ్, జగన్, యుగెందర్, కొమురయ్య, గంగాధర్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



జన్నారం/చెన్నూర్: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చెన్నూర్‌లో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత ఏబీవీపీ జెండాను ఎగురవేశారు. జన్నారం మండలంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఏబీవీపీ జెండాను మండలాధ్యక్షుడు మీనేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెన్నూర్‌లో నగర కార్యదర్శి సాయి, నాయకులు శివాని, భవాని, సుధాకర్, బన్నీ, అరుణ్, రవి, స్వరాజ్, ప్రవీణ్, వేణు, జన్నారంలో శ్రీకర్, నవీన్‌నాయక్, రాజేశ్‌యాదవ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.